# అర్జునుడు - అభిమన్యుడు - వసుంధర

చదువుకునే రోజుల్నించీ కూడా నాకు నా చుట్టూ ఉన్న అసహాయుల్ని చూస్తే జాలి. అజ్ఞానం కారణంగా దోపిడీకి గురవుతున్న వారికి సాయపడాలని ఎన్నో ప్రయత్నాలు చేశాను. ఏదో ఒక రోజున నువ్వు కార్మిక నాయకుడి వవుతావు అనేవారు నా స్నేహితులు.

అది నిజమయింది. బియ్యే పాసైనా నా కో ఫాక్టరీలో చిన్న గుమస్తా ఉద్యోగం మాత్రం దొరికింది. అదీ అకౌంట్సు డిపార్టుమెంట్లో! అందువల్ల యాజమాన్యం కార్మికుల పట్ల జరిపే అన్యాయాలు నాకు మరింత బాగా అర్థ మయ్యాయి. ఫాక్టరీ నష్టంలో నడుస్తోందని అబద్ధం చెప్పి ఇవ్వాల్సిన బోనసు నాపడమే గాక, తాత్కాలికంగా ఇంక్రిమెంట్లు కూడా నిలిపివేసింది యాజమాన్యం. ఈ అబద్ధాన్ని కప్పిపుచ్చినందుకు అకౌంట్సు డిపార్టుమెంట్లో వాళ్ళందరికీ జీతాలు బాగా పెంచింది యాజమాన్యం. అయితే నే నూరుకోలేదు. విషయం కార్మిక నాయకులకు చేరవేశాను. సరైన లెక్కలు రహస్యంగా అందజేశాను. అంతే! ఆందోళన ప్రారంభమైంది.

అందులో కార్మికు లెంతవరకూ విజయం సాధించా రన్నది ముఖ్యం కాదు. నేను కార్మిక నాయకుడిని కావడాని కా ఆందోళన దోహదం చేసింది. ఇలాంటి నాయకత్వానికి గుడ్డిగా నమ్మే అనుచరులు కావాలి. న న్నెందరో గుడ్డిగా నమ్ముతున్నారు. వాళ్ళే వద్దంటున్నా నాకు నాయకత్వం అంటగట్టారు. నా కారణంగా చిన్నారావుకు నాయకత్వం పోయింది. ఫాక్టరీ యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికులకు ద్రోహం చేస్తున్నాడని అతడిపై ఆరోపణ.

నేను కార్మిక నాయకుడినైతే యాజమాన్యం సంతోషించింది. నన్ను ప్రత్యేకంగా పిలిచి కార్మికులను తప్పుదోవ పట్టించి యాజమాన్యానికి సహకరించవలసిందిగా మేనేజరు నన్ను కోరారు. అలా చేయకపోతే అకౌంట్సు రహస్యాలు లీక్ చేసినందుకు గానూ నన్ను డిస్మిస్ చేయగలనని కూడా బెదిరించాడు. అదంత సులభం కాదని నాకు తెలుసు.

అయితే మేనేజరు తెలివితక్కువవాడు కాదు. ఆయన ఆ రోజునుంచీ చిన్నారావును చేరదీయసాగాడు. చిన్నారావు కార్మికుల్లో నామీద దురభిప్రాయం కలిగించసాగాడు. కార్మిక నాయకుడిగా కలకాలం మనగలగాలని నే ననుకోవడం లేదు. కానీ చిన్నారావు వంటి దుష్టుడు నాయకుడైతే కార్మికుల స్థితిగతులు బాగుపడవు. నాకు కార్మికులంటే జాలి. చిన్నారావు బారినుండి వారిని రక్షించాలంటే నేను ముందుగా ఏదైనా సాధించాలి. అందుకోసం బోనసు నెన్నుకున్నాను.

యాజమాన్యం కార్మికులకు బోనసు నివ్వడానికి అవసరమైన లెక్కల వివరాలు నాకు తెలుసు. యాజమాన్యం న న్నిప్పుడు సీటు మార్చినా నా క్కావలసిన వివరాలు రాబట్టుకోవడం నాకు తెలుసు. అందుకే రెండు నెలలు ముందుగా సమ్మె నోటీసు కూడా ఇచ్చాను.

మేనేజరు నాతో మంతనాలు ప్రారంభించాడు. చిన్నారావు కార్మికుల్లో సమ్మెవల్ల వచ్చే ఆర్థిక సంక్షోభం గురించి చెప్పి బెదిరించసాగాడు. నేను మాత్రం ఇరువైపుల దాడినీ పద్మవ్యూహంలో ప్రవేశించిన అభిమన్యుడిలా ఎదుర్కుంటున్నాను. రోజులు గడుస్తున్నాయి కానీ, యాజమాన్యం దిగి రాలేదు. సమ్మె తప్పనిసరి అనిపిస్తోంది. నా ఆధ్వర్యంలో జరగబోయే మొదటి సమ్మె గురించి నేను కాస్త నెర్వస్‌గా కూడా ఉన్నాను. నామీద కొన్ని వందల కార్మికుల జీవితాలు ఆధారపడి ఉన్నాయి. వారికి నేను న్యాయం చేకూర్చగలనా?

సమ్మె ప్రారంభానికి పదే రోజులు గడువు ఉంది. యాజమాన్యం సమ్మెకు భయపడడం లేదు. ఆ రోజు రాత్రి ఇంట్లో మంచంమీద పడుకుని తీవ్రంగా ఆలోచిస్తున్నాను.


నా భార్య లలిత వచ్చి నన్ను పలకరించింది. లలిత కూడా బియ్యే పాసయ్యింది. ఆ ఊళ్ళోనే మరో ఫాక్టరీలో అడ్మినిస్ట్రేటివ్ సెక్షన్లో అసిస్టెంటుగా ఉంటోంది. ఎన్నో విషయాల్లో ఆమె నాకు సలహా లిస్తూంటుంది. ఇప్పుడు కూడా పరిస్థితు లడిగి తెలుసుకుని - "ఈ విషయం నా కెందుకు చెప్పలేదు?" అంది.

నేను కావాలనే నా భార్యకు సమ్మె సంగతి చెప్పలేదు. ఇలాంటి విషయాల్లో ఆడవాళ్ళ జోక్యం మంచిది కాదని నా నమ్మకం. అందులోనూ ఆమె అభిప్రాయంలో నేను కార్మిక నాయకుడిగా పనికిరానని నాకు తెలుసు. అందుకే ఆమె ప్రశ్నకు బదులుగా నవ్వాను.

"నా మాట విని మా ఫాక్టరీలో కార్మిక నాయకుడు చలపతిని సంప్రదించండి. అతడు సమ్మె నోటీ సిచ్చాడంటే యాజమాన్యం గడగడ లాడిపోయి, సంప్రదింపులకి దిగుతుంది. అతడు మీకులా ఒకే ఒక్క కోరికతో యాజమాన్యంమీద కత్తి దూయడు. వారం రోజుల క్రితమే మా ఫాక్టరీలో ఓ కార్మికుణ్ణి పనిలోంచి తొలగించారు. అతణ్ణి తిరిగి పనిలోకి తీసుకోవాలని వెంటనే సమ్మె నోటీ సిచ్చాడు చలపతి. అంతేకాదు, ఇదే అవకాశంగా తీసుకుని మరో పందొమ్మిది కోర్కెల్ని బయటపెట్టాడు. అందులో ఫాక్టరీ డిస్పెన్సరీలో డాక్టరు అదనంగా మరో గంట ఉండాలని కూడా ఒక డిమాండు. చలపతి తన మొత్తం డిమాండ్సన్నీ సాధించగలడని చెప్పుకుంటున్నారు. యాజమాన్యం అతణ్ణి రోజూ సంప్రదిస్తోంది. అతడు సమ్మె నోటీ సిచ్చి వార మయిందంతే! మీరు సమ్మె నోటీ సిచ్చి ఆరు వారాలు దాటిపోయిం దంటున్నారు - నా కేదో భయంగా ఉంది" అంది లలిత.

అంత ఆశ్చర్యంగా విన్నాను. కార్మికుల ఒక్కగా నొక్క కోరిక తీర్చడానికి నానా తిప్పలు పడుతూంటే, ఒక్కసారిగా అన్ని కోర్కెలు సాధించగల శక్తి చలపతి కెలా వచ్చింది?

నేను చలపతిని కలుసుకున్నాను. అతడు నన్ను అభిమానంగా పలకరించి ఆప్యాయంగా ఆదరించాడు. విషయం చెప్పాను నేను. అతడు నా వంక అదోలా చూసి - "బహుశా నీకు నేను సాయపడలేను" అన్నాడు.



"ఎందుకని?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఈ చుట్టుపక్కల అయిదారు జిల్లాల్లో ఏ ఫాక్టరీ కార్మిక నాయకుడైనా సరే నన్ను సంప్రదించనిదే సమ్మె నోటీ సివ్వడు. నీకు నామీద నమ్మక మున్నట్లు లేదు. నన్ను నమ్మని వారికి నేను సాయపడలేను" అన్నాడు చలపతి.

"నన్ను నమ్మిన కార్మికుల బాగుకోసం నేను శ్రమ పడుతున్నాను. అది చాలధా నువ్వు నాకు సాయపడడానికి" అన్నాను.

"నీ గురించి నాకు చిన్నారావు చెప్పాడు. యాజమాన్యానికీ, కార్మికులకీ మధ్య జరిగే యుద్ధం కురుక్షేత్ర సంగ్రామం వంటిది. ఇరు పక్షాలలోనూ ఒకరి మేలు ఒకరు కోరేవా రుంటారు. ఇరుపక్షాలూ సమంగా నష్టపోత యి. చివరకు గెలు పెవరిదీ కాదు. ఈ సంగ్రామంలో సమ్మె పద్మవ్యూహం. అందులో అభిమన్యులు మధ్యలోనే మాడి మసైపోత రు. అర్జునులు మాత్రమే చివరిదాకా మనగలిగి బయటపడగలుగుత రు. కార్మికులకు కావలసిన నాయకు డభిమన్యుడు కాదు, అర్జునుడు!" అన్నాడు చలపతి.

"ఏమిటీ తేడా వా ళిద్దరికీ?"

"యుద్ధంలో తన శౌర్యప్రతపాలు ప్రదర్శించి శత్రువును నిర్జించా లనుకునేవాడు అభిమన్యుడు. శౌర్యప్రతపాలతో పనిలేని ఇతర వ్యూహాలతో శత్రువును నిర్జించి తన వా రెందరు నశించినా తను మాత్రం మహావీరుడని పేరు తెచ్చుకునేవాడు అర్జునుడు."

నే నాలోచనలో పడ్డాను.

"ను వ్వభిమన్యుడవని నీ సమ్మె నోటీసే చెబుతోంది. ఈ పద్మవ్యూహం లోంచి నువ్వు బయట పడలేవు" అన్నాడు చలపతి మళ్ళీ.

"నేనేం చేయాలో చెప్పు. నన్ను నమ్మిన వారికోసం నే నేమైనా చేస్తాను."

చలపతి నవ్వి - "ఇకమీదట నాకు తెలియకుండా సమ్మె నోటీ సివ్వనని మాటిస్తే నీ కో ఉపాయం చెబుత ను" అన్నాడు.


వెంటనే ఒప్పుకున్నాను.

"ను వ్వేం చేయాలో నేను చెప్పను. నే నేం చేశానో చెబుత ను" అంటూ ప్రారంభించాడు చలపతి.

వాళ్ళ ఫాక్టరీలో ఓ కార్మికుడు డిస్మిస్ చేయబడ్డాడు. అందులో యాజమాన్యం తప్పు లేదు. వాడు త గి ఫాక్టరీలో నానా రభసా చేశాడు. మేనేజర్ని బూతులు తిట్టాడు. వాడి విషయంలో యాజమాన్యం పట్టుదలగా ఉంది. కానీ తప్పు చేసింది కార్మికుడు కాబట్టి కార్మిక నాయకుడుగా తను మద్దతు నివ్వాలి.

"ఈ ఒక్క డిమాండుతో సమ్మె ప్రారంభిస్తే అది విజయం కాదు. అందుకోసం కార్మికు లందర్నీ సమావేశపరిచి సాటి కార్మికుడికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ తీవ్రంగా ఉపన్యసించి ఆవేశపరిచి, యాజమాన్యం ఇంకా ఎన్నో విషయాల్లో కార్మికుల సదుపాయాలను అలక్ష్యం చేసిందని వారిని నమ్మించి మా డిమాండ్సుకు మరిన్ని జతపరిచాను. ఉదాహరణకు ఫాక్టరీ మెయిన్ గేటు దగ్గర వాచ్‌మన్ మా అసోసియేషన్ మెంబరు కాదు. వాడు యాజమాన్యం మనిషి.






వాడు కార్మిక స్త్రీలతో అనభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించి వాడి నక్కణ్ణించి మార్చి మా అసోసియేషన్ మెంబర్ని వేయాలన్నది మా. డిమాండ్లులో ఒకటి'' అన్నాడు చలపతి.

''దానికోసం సమ్మె చేయాలా?'' అన్నా నాశ్చర్యంగా.

''అక్కర్లేదు. అసలు యాజమాన్యమే నా కీ డిమాండు నూచించింది'' అన్నాడు చలపతి నవ్వుతూ.

''కార్మికుల సమ్మెకు యాజమాన్యం డిమాండ్లు నూచించడమా?'' అన్నా నాశ్చర్యంగా.

''శిఖండి నడ్డు పెట్టుకుని బాణాలు వేయమని భీష్ముడు అర్జునుడికి చెప్పలేదూ? అంతే. సమ్మె ప్రారంభానికి ముందే జరిగే సంప్రదింపుల్లో యాజమాన్యం తాము కార్మికులకు చేయగల నదుపాయాల గురించి చెబుతుంది. వాటిని కార్మికుల అవసరాలుగా నమ్మించి, డిమాండ్లుగా మార్చి సమ్మె ప్రారంభిస్తాం.''

''అందువల్ల ప్రయోజనం...?''

''అసలు సమస్య మరుగున పడిపోతుంది. ఇరవై డిమాండ్లులో ఒకటిగా పలచబడిపోయే అసలు నమస్య తీరకపోయినా - ఇరవైకి పందొమ్మిది డిమాండ్లు సాధించిన వాడిగా నాయకుడైన నాకు పే రొస్తుంది. సమ్మె పద్మవ్యూహమైతే మిగతా పందొమ్మిది డిమాండ్లూ సమ్మె నుంచి బయటపడడానికి ద్వారాలు. ఒకే డిమాండుతో సమ్మె ప్రారంభిస్తే బయటపడ్డానికి దారి కనిపించక నాయకుడు అటు యాజమాన్యం, ఇటు కార్మికుల ఆగ్రహానికి గురై హతమవుతాడు'' అన్నాడు చలపతి.

''అయితే డిస్మిస్ చేయబడ్డ ఆ కార్మికుడి గతేమవుతుంది?'' బాధగా అడిగాను.

''ఇరవైలో పందొమ్మిది డిమాండ్లు తీరేక మనమూ కొంత దిగి రావాలంటాను. ఏ షరతులూ లేకుండా వాణ్ణి పనిలోకి తీసుకోవా లనకుండా వాడిపై తాత్కాలిక క్రమశిక్షణ చర్యను తీసుకుందుకు అనుమతించి, వాడినుంచి లిఖితపూర్వకంగా క్షమార్పణలు స్వీకరించి వదిలిపెట్టా లంటాను. అదీ సంగతి!''

''ఇందువల్ల ఎవరికి ప్రయోజనం?''

''నా నాయకత్వం పది కాలాలపాటు నిలబడడం నా ఆశయం. నిస్వార్థంగా ప్రజా సేవ చేయా లనుకునేవాడికి నాలుగువైపుల నుంచీ నిరాశే ఎదురవుతుంది. కార్మికులు నీవంటివాణ్ణి నాయకుడిగా భరించలేరు. వాళ్ళు భరించా లనుకుంటే నువ్వూ నాకు లా మారు. అందువల్ల ఎవరికి ప్రయోజనమో అప్పుడు నీకూ తెలుస్తుంది.''

అర్థ మవుతోంది. నే నిప్పుడు నా డిమాండ్లు పెంచాలి. వెంటనే యాజమాన్యం నన్ను అభిమన్యుడుగా కాక అర్జునుడిగా గుర్తించి సంప్రదింపులకి పిలుస్తుంది. సమ్మె ఆగిపోతుంది. ఎట్టి పరిస్థితులలోనూ కార్మికులకు నే నడిగిన పద్ధతిలో బోనస్ రాదు. ఆలోచిస్తున్నాను.

''నీవు నా దారికి రాకపోతే అవతల చిన్నారావు కాచుకుని ఉన్నాడు. నీ సమ్మె విఫలం కావడం తథ్యం. అతడు మళ్ళీ నాయకుడు కావడం తథ్యం. గతంలో నన్ను సరిగ్గా సంప్రదించక తన నాయకత్వాన్ని పోగొట్టుకున్నాడు చిన్నారావు. ఈసారి కిక అలా జరుగదు.'' హెచ్చరించాడు చలపతి.

చిన్నారా వెలాంటివాడో నాకు తెలును. కానీ చలపతి దారిలో నడిచి నేనూ మరో చిన్నారావును కానా?

ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాను. చలపతి మాత్రం నా కింకేమీ చెప్పలేదు. వారం రోజులు తిరక్కుండా మా సమ్మె ఆగిపోయింది. పదిహేను డిమాండ్లులో ఒక్క బోనసు తప్ప అన్నీ సాధించానని కార్మికు లందరూ నన్ను మెచ్చుకుంటున్నారు. బోనసు కూడా అనుకున్నంత కాకపోయినా ఎంతో కొంత రానున్నది.

కార్మికుల సంతోషం చూస్తూంటే, నా నాయకత్వం ఇదే విధంగా కలకాలం వారిని సంతోషంగా ఉంచగలదని నాకు తోచింది. ★

## రాంగ్ నంబర్

చీకటి చీర కట్టుకుని
తల వంచుకు నిలుచున్నది చరిత్ర
శవాన్ని మోస్తున్న
నలుగుర్ని చంపేస్తే
పాడె మీది శవమే
పరుగెత్తుకు శ్మశానానికి పోయినట్టు
గతం చితి మీద
వర్తమానం రగులుతుంది.
జీవితం లెక్కని
ఎన్నిసార్లు చేసినా
తప్పుడు ఆన్సరే వస్తుంది
అసలు సూత్రమే తప్పు!
క్షణాల వేదిక మీద
అంకెలు తాగి తూలుతున్నాయి
ఆశల విరులు
ఆవిరులు గక్కుతున్నాయి
కాలం పొడుగునా
పగలు గ్రహణం
రాత్రి అమావాస్య
ఇముడలేని
ఇరుకు సందు జగతి
ఇందులోన
ధనం వంతు ప్రగతి
మన జీవితం
మనకు రాంగ్ నంబర్!

\- మంచెం జనార్దనరావు